## క్లుప్తంగా

### నేడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర

పరకాల/నడికూడ : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర పరకాల నియోజకవర్గంలోకి నేడు (సోమవారం) చేరుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్ర నియోజకవర్గ పరిధిలోని నడికూడ మండలంలోని కంఠాత్మకూర్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. కంఠాత్మకూర్ నుంచి ధర్మారం, నడికూడ మండల కేంద్రం మీదుగా పులిగిల్ల గ్రామానికి చేరుకుంటుందని, సమ్మక్క సారలమ్మ గద్దెలకు రేవంత్ రెడ్డి పూజలు చేస్తారని వివరించారు. అనంతరం నర్సక్కపల్లె, మల్లక్‌పేటకు చేరుకొని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పరకాల పట్టణానికి యాత్ర చేరుతుందని పేర్కొన్నారు. తదనంతరం పరకాల పట్టణంలోని బస్టాండ్ ప్రధాన కూడలిలో తలపెట్టిన బహిరంగ సభను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు.

### విజయవంతం చేయండి

ఆత్మకూరు : పరకాలలో నేడు (సోమవారం) తలపెట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆకాంక్షించారు.

### గ్రామ కమిటీ ఎన్నిక



కమలాపూర్ : మండలంలోని దేశరాజుపల్లిలో అఖిల భారత యాదవ మహాసభ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లబోయిన రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లావుల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఎల్లావుల లక్ష్మణ్, కోశాధికారిగా ఎల్లబోయిన రఘు, కార్యవర్గ సభ్యులుగా ఎల్లబోయిన కుమారస్వామి, కొంరయ్య, రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా ఎ.సారయ్య, రాజ్‌కోటి ఎన్నికయ్యారు.

### అంధుల పాఠశాలకు చేయూత

వరంగల్: వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఉదయం పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం కోసం రూ.5వేల నగదు అందజేశారు. హనుమకొండ పద్మాక్షిరోడ్డులోని హనుమాన్ దీక్ష సేవాసమితి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అన్నదాన కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు దశరథ్‌కుమార్, గంధ్రతి సుధాకర్‌లతో పాటు ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.

### యూనిటీ రన్ ర్యాలీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ యూనిటీ రన్ ర్యాలీని ఆదివారం చేపట్టారు. కాజీపేట స్కౌట్ అండ్ గైడ్స్ కార్యాలయం ఎదుట మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, ఓబీసీ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్‌కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కాజీపేట జంక్షన్ మీదుగా ఎలక్ట్రిక్ లోకోషెడ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్, రేంజర్స్, రోవర్స్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### బెనిఫిట్స్ చెల్లించాలి

హన్మకొండ: రిటైర్డ్ ఉద్యోగులకు 2018 నుంచి పూర్తి స్థాయిలో పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల కావడం లేదని, ఈక్రమంలో వాటిని చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న అన్నారు. ఆదర్శ కాలనీలో అసోసియేషన్ నయింనగర్ యూనిట్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నారాయణగిరి వీరన్న మాట్లాడుతూ 11వ పీఆర్‌సీకి సంబంధించిన ప్రయోజనాలను నగదు రూపంలో ఏకమొత్తంగా చెల్లించాలన్నారు. యూనిట్ అధ్యక్షుడు సముద్రాల రామాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోశాధికారి యాదగిరి, నాయకులు నన్నపునేని సంజీవరావు, రాజేశ్వరరావు, నరసింహస్వామి, శంకర్‌రావు, మల్లికార్జున్, మెరుగు బాబు, వీరస్వామి, ఎల్లగౌడ్, వజ్రమ్మ, గురుమూర్తి, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

### 4న అంబేడ్కర్ యువజన సంఘం మహాసభ

హన్మకొండ: హైదరాబాద్‌లో మార్చి 4న జరగనున్న అంబేడ్కర్ యువజన సంఘం మహాసభను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం మహాసభ కరపత్రాలను నాయకులు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ దళిత, గిరిజనుల సమస్యలపై స్పందిస్తూ పరిష్కారం కోసం అంబేడ్కర్ యువజన సంఘం పోరాడుతోందని అన్నారు. కార్యక్రమంలో బొమ్మల అంబేద్కర్, ఎ.రవిందర్, పి.సాంబయ్య, యాడల రవిందర్, బి.శ్రీనివాస్, దొమ్మటి ప్రవీణ్ కుమార్, విశ్వేశ్వర్, ఇమ్మడి కొమురయ్య, జగపతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఘనత సీఎం కేసీఆర్‌దే..

● శాసనమండలి ఉప సభాపతి బండా ప్రకాశ్



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న బండా ప్రకాశ్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: రాష్ట్రంలో రూ.వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని శాసనమండలి ఉప సభాపతి బండా ప్రకాశ్ అన్నారు. ఆదివారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కంఠాత్మకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. రూ.60లక్షలతో సీసీ రోడ్డు, రూ.20లక్షలతో మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి.. 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దని అన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కంఠాత్మకూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.7కోట్లు మంజూరైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, సీఎం కేసీఆర్ సహాయ సహకారాలతో పరకాల నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందన్నారు. తొలుత బండా ప్రకాశ్‌కు పరకాల పట్టణ ముదిరాజ్ కులస్తులు బండి శ్రీధర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, ఎంపీపీ మచ్చ అనసూర్య, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, రైతు సమన్వయ జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదరణ ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి సంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిధి గోవిందాపూర్, పెద్దకోడెపాక, కొప్పుల, ప్రగతిసింగారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి, సూరంపేట గ్రామాల్లో రూ.2.20కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు, రూ.1.80కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అంతర్గత రోడ్లు, జీపీ భవన శంకుస్థాపన, సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్ర భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఆయన ఆదివారం వరంగల్ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. కేంద్రం ఎంపిక చేసిన ఉత్తమ జీపీలు, మున్సిపాలిటీల్లో మొదటి 20 స్థానాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచే ఉన్నాయని చెప్పారు. ఈనెల 23న భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యం కనిపించడంతో ప్రతిపక్షాలు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నాయని, తప్పుడు ప్రచారం చేసే వ్యక్తులకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామ్‌శెట్టి లతా లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.నందం, సర్పంచ్‌లు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, గోలి మాధురి మహేదర్‌రెడ్డి, బైరి శ్రీనివాస్, పోతు సుమలత రమణారెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఆకుతోట రాజేష్, బొల్లెద్ల రజిత రఘుపతిరెడ్డి, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో అన్యాయం

● కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఎల్కతుర్తి : బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయం జరుగుతోందని బీజేపీ అనుబంధ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పుల్యాల రవీందర్‌రెడి తెలిపారు. మండలంలోని సూరారం గ్రామంలో మండల అధ్యక్షుడు బిట్ల లింగయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ×మన్‌కీ బాత్× సమావేశానికి ముఖ్యఅతిథిగా రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ ఇస్తామంటూనే కనీసం అవసరమైన మేరకు కూడా కరంటు ఇవ్వకుండా సీఎం కేసీఆర్ మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ఊదరగొట్టినా చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. పార్టీ అనుబంధ గొర్ల కాపర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు ముష్కె వెంకటేష్ మాట్లాడుతూ యాదవులకు గొర్రెల పంపిణీ పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు అర్హులకు పూర్తిస్థాయిలో అందించలేదని చెప్పారు. నగరాల్లో మొదటి విడత కూడా విడుదల చేయలేదని విమర్శించారు. 2017లో డీడీలు కట్టినా ఇప్పటివరకు ఇచ్చిన దాఖలాల్లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొర్ల కాపర్లను రాష్ట్ర ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని దుయ్యబట్టారు. మోసపూరిత పాలనకు కేరాఫ్‌గా మారిన రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని శ్రేణులను, ప్రజలను కోరారు. సమావేశంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెపాటి మధుకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పుట్ట కనుకయ్య, నాయకులు మిట్టపల్లి మధుకర్, గాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పరకాల : పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 1995–96లో పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక ఆదివారం చోటు చేసుకుంది. నాటి టెన్త్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని వేడుకగా నిర్వహించారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు.

### జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



ఎల్లమ్మతో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈనెల 23న జరిగిన మంత్రి కేటీఆర్ సభ సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాటలో శాయంపేట మండల కేంద్రానికి చెందిన కుతాటి ఎల్లమ్మ తీవ్ర గాయాలపాలు కాగా ఆమెను వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పరామర్శించారు. ఎల్లమ్మ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.నందం, నాయకులు మారపల్లి మోహన్ పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన కొమ్మిడి వెంకన్న, రఘునమ్మ, రవి, కొడపాక మురళి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, నాగుర్ల సంతోష్, రమేష్, సతీష్, శ్రీధర్‌రెడ్డి, బాపూరావు, దేవేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రావు, యుగేందర్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### కేదారేశ్వర ఆలయంలో అభిషేకం

మడికొండ : మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మడికొండ గ్రామంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ఉన్న కేదారేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారికి ఐదు బావుల నీటితో అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ ఆదివారం అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దువ్వ శ్రీకాంత్ – సరిత, పైడిపాల రఘుచందర్ – కవిత, దువ్వ కృష్ణ – మమత, దువ్వ సందీప్, సాయి, పవన్ సహకారంతో అన్నదానం చేశారు.

### ఆహార కల్తీని అరికట్టాలి

ఖిలా వరంగల్ : ఆహార కల్తీని అరికట్టేలా ఆహార కల్తీ నిరోధక శాఖ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్, లీగల్ మెట్రాలజీ, వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖ, అగ్‌మార్క్, మునిసిపల్ కార్పొరేషన్‌లు ప్రముఖ పాత్ర పోషించాలని కన్జ్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మొగలిచెర్ల సుదర్శన్ కోరారు. ఈమేరకు న్యూఢిల్లీలో సీసీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణితో కలిసి వినియోగదారుల రక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆహార కల్తీని అరికట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు.

# మెరుగైన సేవలతోనే సరైన గుర్తింపు

● హిటాచీ ఏటీఎం ప్రారంభం



ఏటీఎంను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ సంజీవ్

కమలాపూర్ : ప్రజలకు, బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం ద్వారానే సరైన గుర్తింపు పొందగలరని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కొత్తగా నెలకొల్పిన హిటాచీ ఏటీఎంను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు సేవలు అందించడంలో పోటీ నెలకొందని చెప్పారు. సమాజంలో వస్తున్న అభివృద్ధికి అనుగుణంగా మరింత ఉత్తమ సేవలు అందించాలని హిటాచీ నిర్వాహకులను కోరారు. ఏటీఎంను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హిటాచీ తెలంగాణ ఇన్‌చార్జి సోమేశ్వర్, ఏటీఎం నిర్వాహకుడు కొనిశెట్టి మునీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, నాయకులు పింగిలి ప్రదీప్‌రెడ్డి, మౌటం అశోక్, బాలసాని రమేష్‌గౌడ్, వెనిశెట్టి విజయ్‌కుమార్, శాంతికృష్ణ, సూక వీరభద్రయ్య, భూపతి శివశంకర్, రఘురాం, మాడిశెట్టి సంపత్, కస్నూరి శ్రీధరాచారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా బీజేపీ



కమలాపూర్ : పరామర్శిస్తున్న రాజేందర్



శాయంపేట : పరామర్శిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి

● హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కమలాపూర్ : పేద కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వినయ్‌కుమార్, వెల్ది వెంకటలక్ష్మి, పింగిలి మల్లారెడ్డి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు మాట్ల రమేష్, గంధసిరి రవికుమార్, వలిగె సాంబరావు, తుమ్మ శోభన్‌బాబు, పిల్లి సతీష్, కొండమీది భిక్షపతి, రవి, పుల్ల శోభన్‌బాబు, పి.నరేందర్‌రెడ్డి, ఓదెలు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు..**

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన వంగాల బతుకమ్మ, శాయంపేట గ్రామానికి చెందిన సింగారపు సురేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట నాయకులు రాయరాకుల మొగిళి, నరహరిశెట్టి రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, సంజీవరావు తదితరులున్నారు.

# ఎమ్మెల్యే 'చల్లా' చొరవతోనే అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బీఆర్ఎస్ బృందంతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మారెడ్డి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో శతాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పంట కాలువల మరమ్మతులకు ఎమ్మెల్యే ధర్మారెడ్డి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టారని తెలిపారు. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని విస్మరించాయని చెప్పారు. ఇకనైనా బీఆర్ఎస్‌పై ఆరోపణలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వంగాల భగవాన్‌రెడ్డి, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.రవీందర్, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ అంకూస్, రైతు కోఆర్డినేటర్లు సాగర్, విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు పైడి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# భవన నిర్మాణరంగ కార్మికులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

హన్మకొండ: భవన నిర్మాణ రంగంలోని వివిధ విభాగాల్లోని కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ వడ్డెపల్లి చర్చి కూడలిలో సదాశివ సెంట్రింగ్ సలాక సంఘం కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్మికుల సంక్షేమానికి సర్కారు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేశం, లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, సదాశివ సెంటింగ్ సలాక సంఘం అధ్యక్షుడు కల్వచర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం సదానందం, నాయకులు గుగులోతు యాకన్న, భూక్యా యాదగిరి, భూక్య శ్రీను, సిరికొండ భిక్షపతి, భూక్యా మోహన్, నాయకులు ఖండేరావు నర్సింహారావు, ఆకుల మధుకర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

# గ్రంథాలయం ప్రారంభం.. సామగ్రి అందజేత



ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా రూ.50 వేలు విలువైన పుస్తకాలు, బీరువాలు, టేబుల్, ఫ్యాన్లను గ్రంథాలయానికి హైదరాబాద్‌కు చెందిన బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ముక్క శ్రీనివాస్ అందించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడారు. బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ గ్రంథాలయానికి పుస్తకాలు, సామగ్రి అందించడం అభినందనీయమని తెలిపారు. గ్రంథాలయాలకు పుస్తకాలు, ఇతరత్రా చేయూత అందించడానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. దాతలు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. స్థానిక సర్పంచ్ పోతు సుమలత రమణారెడ్డి, గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మీ–రమేష్ దంపతుల కుమారుడు శ్రీనివాస్ స్వచ్ఛంద సంస్థ తరపున గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నీచర్ విరాళంగా అందించారని తెలిపారు. అనంతరం గండ్ర వెంకటరమణారెడ్డి–జ్యోతి దంపతులు స్వచ్ఛంద సంస్థ, ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు.

# విద్యార్థి దశ నుంచే విలువలు నేర్పాలి



ఉపాధ్యాయులతో రవీందర్

విద్యారణ్యపురి: చిన్నప్పటి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని, నైతిక విలువలను పెంపొందించాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ సూచించారు. శనివారం రాత్రి జరిగిన హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను నేర్పిస్తూ వారిలో దేశభక్తిని పెంపొందించాలన్నారు. చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హనుమకొండలోని సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు విద్యతోపాటు ఆటలు, పాటలు, సంగీతం, నృత్యం, చెస్ లాంటి అంశాల్లో తర్ఫీదు ఇస్తే వాళ్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, సంగీత మాస్టర్ జయపాల్, క్లాసికల్ డ్యాన్స్ మాస్టర్ శివ, ఉపాధ్యాయులు వికాస్, సాయిప్రసన్న, గీత, సంతోష్, స్వర్ణకుమారి, రమ దివ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# అరాచక పాలన అంతమే లక్ష్యం

● కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుమన్, తదితరులు

ఎల్కతుర్తి : ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాల అరాచక పాలనను అంతం చేయడమే లక్ష్యంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాథ్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మండ సుమన్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రచార కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర మార్చి 2న హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట మండలంలోని కట్కూర్ క్రాస్ నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు మొదలై హుస్నాబాద్ వరకు కొనసాగుతుందని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, చంద్రమౌళి, బర్మా, గణేష్, హింగె శ్రీకాంత్, రోహిత్, ప్రణయ్, ఉదయ్, జశ్వంత్, చత్రపతి, అజయ్, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

# కుటుంబ సభ్యులకు మూగ మహిళ అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సఖి సిబ్బంది

వరంగల్: ఈనెల 20న వరంగల్ బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న మూగ మహిళను మిల్స్‌కాలనీ పోలీసులు చేరదీసి సఖి సెంటర్‌కు అప్పగించగా సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో వసతి కల్పించారు. సంగెం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌తో ఈవిషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు 26న సఖి సెంటర్‌కు వచ్చినట్లు కౌన్సిలర్ రమాదేవి తెలిపారు. వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ వడ్డెరగూడెంకు చెందిన బానోతు పూలమ్మ (75)కు పక్షవాతం రావడంతో మాట పడిపోయింది. ఇంట్లోనే ఉంటున్న ఆమె నెల రోజుల క్రితం బయటకు వెళ్లి తప్పిపోయింది. బంధువుల ఇళ్లల్లో, పక్కనే ఉన్న గ్రామాల్లో వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పూలమ్మ మళ్లీ కనిపించడంతో ఆమె కుటుంబీకులు కన్నీళ్ల పర్యంతమై భావోద్వేగానికి గురయ్యారు. ఆశ్రయం కల్పించి క్షేమంగా చూసుకున్నందుకు సఖి సెంటర్ సిబ్బందికి వారు ధన్యవాదాలు తెలిపారు.

# కులవృత్తులకు పెద్దపీట



శంకుస్థాపన చేస్తున్న ప్రకాశ్

కాజీపేట అర్బన్ : సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలోని కులవృత్తులకు మహర్దశ లభిస్తోందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. కడిపికొండ గ్రామంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి బండా ప్రకాశ్ ఆదివారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ముదిరాజ్‌లకు ఉచిత చేప పిల్లల పంపిణీ, సబ్సిడీ ద్వారా ద్విచక్ర వాహనాలు, టాటా ఏస్ వాహనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేష్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.